# తాబేలు గెలిచింది

[ఇది తెలుగు పాఠకులు చదివి చదివి బోరెత్తి పోయిన ఒకమ్మాయి — ఇద్దరబ్బాయిలు కథే....అయితే మిమ్మల్ని మోసం చేయడానికి కొత్త వేషం వేసుకుని వచ్చింది. అంతే.

ఆ వేషము, లేదా కథచెప్పిన పద్ధతి బాగున్నదా లేదా అన్నది ఈ కథ చదివాక మీరు చెపాల్సిన విషయం.

ఒకానొక మిత్రుడు—తన కారు ఒక ఎత్తయిన రోడ్‌ను సగం ఎక్కినాక ఇక ముందుకెళ్ళనని మొరాయించినప్పుడు, ఆ కారును ఎత్తునుండి క్రిందికి వెనక్కి "జార" విడిచి, ఆ "జారుడు"లో కారు పని చేయడం మొదలెట్టగా అప్పుడు కారును ముందుకు నడిపించి ఆ రోడ్డు దాటానని చెప్పాడొకనాడు.

ఆ చిన్న సంఘటన చుట్టూ అల్లికలు అల్లి నిర్మించిన సరదా కథ ఇది.]

"అయితే ఆమె హృదయం ఒక చిన్న ప్రజాస్వామ్యం అందూ?'' అని పద్మనాభం చెబుతున్న కథకు అడ్డు పడ్డాడు సత్యారావ్.

ఆ కథా క్రమం పెట్టి దనిన :

వాసవివంటి కన్నె లేదు ఇలమీద. ఆమె ఆవూరి కాలేజి మగవారి జీవితాలకు ఏకైక లక్ష్యం. ఆమె గనుక బి. ఏ. పాసయి చదువు మానేస్తే ఇంకెందుకూ ఆ కాలేజీ—హాయిగా మూసుకోవచ్చును. ఇంక ఆ కాలేజీలో చదివే వారుండరు అది తథ్యం. అటువంటి వాసవి కంటే అల్పుడు జన్మతః దుర దృష్టవంతుడు. కేవలం మానవుడూ అయిన తాను ఆ అందాల దేవత కంటబడ్డాడు. ఆమె తనతో అబ్బ... చెబుదామంటే ఆనందం గొంతుకు అడ్డం పడుతున్నది...ఆమె, తనతో మాట్లాడింది. పుస్తకం ఇచ్చింది. తననోట్సు పుచ్చుకుంది. ఇంకా చెప్పాలంటే సినిమాకు ఇద్దరూకలిసి వెళ్ళారు, ఏమంటావు దానికి ?

''ఓ యబ్బో! ఓ యబ్బో!''-అంటూ నవ్వాడు సత్యారావ్.

ఈ సినిమా వెళ్ళడందాక కథనడపడాని కెంతకాలమో పట్టలేదు. అంతాచేస్తే మూణ్ణెల్లాయి. అంతే అంతలో తన జీవితంలో ఇన్ని మార్పులు!

"శత దినోత్సవం కా లేదన్నమాట" అన్నాడు సత్యారావ్.

కాని ఇంగ్లీషు సామెత ఏమంటుంది? నిజమైన ప్రేమ నున్నని బాటపై నడవదు అంటున్నది. ఎంత "ఒరిజనల్" నిజం అది! ప్రేమబాటపై పోటీల చీకటులూ, అసూయల గోతులూ ఆచారాలముళ్ళ కంపలూ తప్పవు. మజ్నూ అయినా మన్మథు డయినా రోమియో అయినా, పరమశివుడయినా పద్మనాభ మయినా ఈ ఇడుములు పడక తప్పదు. ఏమయిందని ఈ వేదన ...ఇంకేం కావాలి...తనజీవన జ్యోతి ఇంకొకడి హృదయం వైపు ప్రసరించడం గమనించాడు తను ఒకనాడు వాసవీ వెంక ట్రావూ కలిసి నవ్వుతూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంకేదో లోకంలో వుండగా చూచాడు.

"రామరామ" అని బాధపడ్డాడు సత్యారావ్.

ఆ రోజు తనహృదయం హిరోషిమా అయింది. మన సున క్షీరసాగర మథనమే జరిగింది. అయితేనేం ప్రేమ అనే దివ్యామృతాన్నే స్వీకరించిన వాడు గనుక అటువంటి మహా కష్టానికి ఓర్చుకున్నాడు. తను 'తొందర పడకే ఓ మనసా'అని చెప్పుకున్నాడు. తను మరికొన్నిరోజులు బ్రతికిచూద్దాం అను కున్నాడు. తను-నాలుగయిదు రోజులు 'బాధగా' మొహం పెట్టి ఆమెకంట పడీ పడక తిరిగాడు. తను ఆరవరోజు సాయం కాలం చీకటివేళ, కాలేజి గ్రౌండ్స్ విడిచి వచ్చేస్తుంటే వాసవి

పిలిచింది. ఎందుకట్లావున్నావూ అని అడిగింది. ఏం నేనెట్లా వుంటే నీకేం? నేనేమయిపోతే నీకేం అని 'చిందులు' తొక్కాడు తను. ప్రేమ అనే తన బలహీనత కనపడేలా ఆమెను కోప్పడ్డాడు తను. అన్నీవిని వాసవి నవ్వింది. ఆహా... ఎంత 'లవ్‌లీ' నవ్వనీ! ఆ ఒక్క నవ్వుకు వందహీరోషిమా లనుభవించ వచ్చునే...

పిచ్చివాడా అంది. అని... అనీ!! తన జుత్తును ఆమె వేళ్ళతో దువ్వింది. ఇదుగో ఈ జుత్తే వాసవి ముట్టుకున్నది... సరే. వెంకట్రావు ఆఫ్టరాల్ ఒక ఒక ఫ్రెండని వివరించింది. కాలేజీలో ఒకే ఒక అబ్బాయితోనే మాట్లాడుతూంటే అందరూ ఏమనుకుంటారు? అని అడిగింది. వెంకట్రావు అప్పుడప్పుడు కారులో (అదేలే '48 మోడల్ హిందూస్తాన్ డొక్కు) దిగబడుతుంటాడంతే అంది. ఆ మాటలు విని, ఆ కన్నులు కని తన ఎదలో సెగ ఆరింది. తన హృదయాకాశంలో శాంతి పావురాలు ఎగిరాయి మళ్ళా అటు పిమ్మట ఆమె వెంకట్రావ్‌తో కలిసి కన్పించినా, ఆ మాట కొస్తే మరొక అయిదార్గురు అబ్బాయిలతో అప్పుడప్పుడూ అగుపించినా తను మునుపటిలా కుంగిపోలేదు. తనకు వాసవి హృదయం ఎంత విశాలమో తెలిసింది.

"అయితే ఆమె హృదయం ఒక చిన్న ప్రజాస్వామ్యం

అందూ" అని పద్మనాభం చెబుతున్న కథకు అడ్డుపడ్డాడు సత్యారావ్.

అరఘంటాయి తను ఎంతో సీరియస్‌గా చెబుతుంటే వ్యంగ్యం ఒలక బోస్తాడేం వ్యంగ్యం... వాసవి మనసు తనకు తెలుసు... తెలుసు కాని... కాని ఒక్కటుంది మిగతా వాళ్ళందరితో ఆమె వున్నా తన కేమి అన్పించదు.

హిమాలయం వంటి ప్రేమపై ఎత్తుగా వున్న తనను ఈ కుర్రకుంకలు కదిలించ లేరు. జుత్తు రేపుకుంటూ, చొక్కా గుండీలు తెంపుకుంటూ, కాళ్ళకు వార్నిష్ కొట్టినట్లు అతుక్కుపోయే పంట్లాలు వేసుకుంటూఈ కుర్ర సజ్జంతా ఆమె చుట్టూ తిరగడం వలన తను అణుమాత్రమయినా చలించదు. అయితే ఆ వెంకట్రా వున్నాడే, వాడు చాల 'డేంజరస్ ఫెలో' తెగించాడంటే ప్రమాదకరమయిన వ్యక్తి. వాడికి కారుండడమే కాదు. వాడు అటు ఛందస్సులోనూ ఇటు 'బ్లాంక్ వెర్స్' లోనూ కవిత్వం రాసేస్తాడట. ప్రేమ తూణీరంలో కవిత్వం వంటి బాణం లేదనుకో. 'నీ కన్నుల వెన్నెల నీ నవ్వుల పువ్వుల' వంటి పదాలు నారాయణాస్త్రం లాంటివి. వాటికి తిరుగులేదు. వాసవి ఎంతయినా ఆడది. పొగడ్తకు పొంగని పిచ్చి దింతవరకూ ఆ జాతిలో పుట్టలేదు. ఆ కారులో కూచోబెట్టి ఏ సాయంకాలం పూటో షికారు

తీసుకెళ్ళి ఆ పళంగా పద్యాలూ పాటలూ పాడేస్తే ఒంటరిగా వున్న ఆడది ఏమవుతుందీ... ఆ ఆడది ఏమయిపోతుందీ అని

"నీదయి పోతుంది" అని హామీ ఇచ్చాడు సత్యారావ్.

వాడిమొహం నా దవడ మేమిటి—నా దయితే గొడవ ఎందుకు, ఈ గోడెందుకు... ఆ కవిత్వం ఏడిచే కీచకుడి దయి పోతుంది. ఆ ఎదవ వెంకట్రావు గాడున్నాడే ఆడిదయి పోతుంది. ఆసూచన లప్పటికే కాన వస్తున్నాయి. మొన్నొకనాడు తనతో మాట్లాడుతూ అరఘంట సేపులో ఆరుసార్లు వెంకట్రావ్ కవిత్వాన్ని 'కోట్' చేసింది. వాసవి మనసుపై వాడిముద్ర పడుతుందన్న దనడానికి ఇంత కన్న నిదర్శనమేం కావాలి, వాడు పరమశత్రు వనడాని కింక సందేహంలేదు. వాసవి తనదా. వాడిదా తేల్చుకోవా లనుకున్నాడు.

"ఊ... ఇంతకూ అడిగేశావా లేదా?"

ఆహా... తప్పకుండాను. అడక్కుండా. నాన్చుతుంటే ఏంలాభం? వాసవి తనదయితే వివాహం అన్న లాంఛనం ముగించి, భూమిమీదే చిన్న స్వర్గం నిర్మించుకొని ఖుషీగా కులాసాగా అబ్బ... వేధవది చెప్పడానికి భాష లేదు. వాసవి తనది కాకపోయిందా ఇంక పద్మనాభం వుండడు. ఆ పేరు

గలవాడికి బ్రతకడం అనవసరం. వాసవి లేక, వాడి జీవితం ఆధునిక చిత్రకళలాగా అర్థం లేనిది.

"ఛా ఛా! అమంగళపు మాటలు మాట్లాడక ఆమె ఏమందో చెప్పు" అని అడిగాడు సత్యారావ్.

తనడిగాడు, అడిగేశాడు. వాసవి, శ్రీమతి పద్మనాభం అవుతుందా అని అడిగేశాడు. కాని ఆమె వెంటనే పలక లేదు. ఆ మౌనం తన కెంత భయంకరగా వుండిందో... చివరకు పలికింది.

జవాబు చెబుతా పద్మనాభం కాని ఇప్పుడు కాదు ఎల్లుండి ఆదివారం సాయంకాలం ఐదింటికెల్లా నన్ను జగన్నాథపురం తీసుకెళ్ళు అంది.

ఇక్కడికి ముఫై మైళ్ళలోవున్న ఆవూళ్లో ఆమె బంధువులున్నారట. వాళ్ళింట్లో ఆదివారం సాయంకాలం పార్టీ వుందట. అందుకని—అందుకని తన్ను ఎన్నుకుంది వాసవి! అందులోనే లేదూ ఆమె అభిప్రాయానికి సూచన. కాని, కాని హా! విధి ఎంత క్రూరమైనది. ఎట్లా విన్నాడో దేవుడికే తెలుసు గాని మరుక్షణం తగలబడ్డాడు ఆ నరరూపం దాల్చిన చీడ పురుగు!

"వాసవిగారూ! మీ రెక్కడికో వెళ్లాలంటున్నారే!

నా కారుంది రండి, కారు లేక పోతే ఈ ఎండలకు పుష్పం వంటి అందం వాడిపోగలదు" అన్నాడు వాడు.

"ఆమె ఏమంది!"

వెంటనే ఏమీ అనలేదు. కాని ఆ వెధవ, ఆ రాక్షసుడు. వాడే గనుక అంతలావూ పొడుగూ లేక పోతేనా తను వాడి నక్కడే చితగ్గొట్టేసి వుండును. ఆమె మౌనం చూచి వాడన్నాడుగదా—"మీరు గనక రానంటే శుభ్రంగా నా కారుని తిరగేసి నిప్పంటించేస్తాను. మీ కంటూ ఉపయోగించక పోయిన తర్వాత ఇంక నా కారెందుకు? నేనెందుకు?" అని, ఆ దొంగ వెధవ కల్లబొల్లి కబుర్లాడి నప్పుడు ఆమె కన్నుల వెల్గిన వెల్గు—తన గుండెల చిచ్చు అయింది. ఆమె తన వేపు చూచింది. అర్థం చేసుకుంటావు కదూ అన్నట్లు చూచింది. అనగా ఆమె, తన ప్రాణానికి ఊపిరి వంటి దయిన ఆమె తన భావానికిరూపంవంటి దయిన వాసవి—వాడితో ఆ నీచుడితో—ఛీ... ఎట్లా చెప్పగలడు తను... ఇంకెందుకు తను జీవించడం...

"అబ్బబ్బ మరీ భారమయిన డైలాగులు వల్లించకు. పృథ్వేమి మునిగిపోలేదు. ఇంకా చచ్చేంత అవకాశం వుంది చావడానికి. ఈ లోగా పురుష ప్రయత్నం చెయ్యి కొంత... ఇవాళ శనివారం. అంటే రేపు ఆదివారం. రేపు సాయంకాలం

వాసవి జగన్నాథపురం వెళ్లాలి. ఏం? ఆ రావణుడిది పాతకారం టైపి కనక నువ్వు బొత్తిగా ఉపసంహరించుకోవడం అవివేకం కారే రాజులు వారేరి మూటగట్టుకొని పోవంజాలరే అన్నాడు కవి. అంటే ఏవిటనుకున్నావు? కారే అవనీ, రాజే అవనీ ఎల్లప్పుడూ జయించుతారని లేదు. ఇందులో ఇది ఇరవయ్యో శతాబ్దపు ఉత్తరార్థం గనక కారూ రాజూ ఓడి పోవాలి. ఆ మేరకు మన ప్రభుత్వంవారు సాయపడుతున్నారు చూడు. శ్రీవారు కారు వేగంగా వెళ్లేందుకు వీలుగా వుంచరు రోడ్లని. అథవా వెళ్ళినా పదిమైళ్ళ తర్వాత కారు ఆరోగ్యం బాగుండదు. అదిగాక పెను తుఫానులో పెద్దచెట్టు పడి పోయాక నిలిచేది. చివరకు మిగిలేదీ ఏదీ—? గడ్డిమొక్క! గనక కారోడిన చోట స్కూటర్ గెలవవచ్చును. అంచేత నీ స్కూటర్ నివ్వాళ సరి చూసుకో. రేపు నువ్వూ ఆ దారిని వెళ్లు విజయం నిన్ను వరిస్తుంది తప్పక...” అని సోదాహరణంగా వివరించి పద్మనాభం వీపు తట్టాడు సత్యారావ్.

X X X X

ఆదివారం సాయంత్రం నాలుగుంబావయింది వెంకట్రావు కారు జగన్నాథపురం వేపు దూసుకు పోతూంది. ఆ కారులో వాసవి వుంది. ఆ కారుకు వెనక, ఆ కారు వెనక

బయలు దేరింది పద్మనాభం స్కూటర్. కారు కొంతదూరం వెనక బయలు దేరిన ఆ స్కూటరుకూ కారుకూ మధ్యదూరం క్రమంగా పెంచ్చవసాగింది.

కాని పదహారవమైలురాయి దగ్గర వున్న తాటిపల్లి అన్న పెద్దగ్రామాన్ని సమీపిస్తుండగా రోడ్డు ఎత్తునెక్క సాగింది. కారు కష్టపడ నారంభించింది. వెంకట్రావ్ నొసలు ముడి పడింది. వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాడతడు. మొత్తమంతా కలిపి ఎత్తవుతున్న ఆ రోడ్డు పొడవు వంద గజాలుంటుం దేమో కానీ ఆ కారు పడ్డ అవస్థ వర్ణనాతీతం. పాఠం సరిగా చదవని అబ్బాయి తరగతిలో అడిగిన ప్రశ్నకు చెప్పే సమాధానం లాగున తికమక పడింది ఆ కారు, అరవై గజాలయింది. ఇంకో నలభై గజాల దూరముంది. కారు గనక సరిగా చేరేనా వెంకటేశ్వరస్వామికి 108 కొబ్బరి కాయలు కొట్టాలి అనుకున్నాడు వెంకట్రావు. ఆవేదన పడ్డాడు.

ఎట్లాగయితేనేం ఎనభై గజాలయిపోయింది. అంత వరకూ కారు ఎత్తురోడ్డు ఎక్కింది. ఆ మిగతా ఇరవై గజాలు గడిస్తే ముందున్న రోడ్డంతా సమంగా వుంది. ఆ రోడ్డు మీద కారు సాఫీగా, సాగుతుంది. అని మురిసి పోయాడు వెంకట్రావు.

సరిగ్గా అప్పుడే, ఆ వందగజాల ఎత్తయినరోడ్డూ అయి పోయి, సమతలమైన రోడ్డు మొదలవడానికి పదిహేను గజాల

ముందు ఆ కారు గట్టిగా ఒకసారి దగ్గేసి ఢామ్మని ఆగి పోయింది. వాసవి కూర్చునివున్న వెంకట్రావు కారు! కారుతో బాటు అతడి గుండెకాయా ఆగిపోయింది అరక్షణం!

లజ్జ, భయం, వంటివి మనసు వెయ్యి విధాల పీకుతుండగా బయటికి దిగి కారు ముందుకు వెళ్ళి అయిదు నిముషాలు పరీక్షించాడు వెంకట్రావు. ఊహూ—కారు ఉలక లేదు పలక లేదు. టైము నాలుగు ముప్పావయింది. ఇంకా పధ్నాలుగు మైళ్లున్నాయి. "శ్రీనివాసా ఆపద్బాంధవా, అనాధరక్షకా, దీన బంధో... ఏదీ గతీ నాకు, ఏడూ కొండలవాడా—" అని పరి పరి విధముల పరితపించింది అతడి మనసు. మరు క్షణం వెంకటేశ్వరస్వామియే మూరు వేషాలు బూని వస్తున్నాడా అన్నట్లు ముగ్గురు మనుషులటు రావడం కన్పించింది.

చేతులెత్తి వారినాపి, వారికి తన కష్టం వివరించగా వారు ముగ్గురూ కలిసి ఆ కారు నింకా ఎత్తు వైపుకు తోయనారంభించారు కాని చాల కష్టమన్పించింది. అయినా పది పన్నెండడుగుల దూరం తోసినా కారేమీ అందుకోలేదు. అప్పుడా ముగ్గురిలో ఒకరికి ఒక గొప్ప "అయిడియా" తగిలింది. ఇట్లా పైకి ఎత్తువైపుగా తోసుకుపోడం అసాధ్యం గనుక, కారును ఎత్తునుండి క్రిందకు, అనగా వెనక్కు గనక వదలిపెడితే ఎవరూ తోయకుండానే వెనక్కు వేగంగా వెళ్తుంది ఆ వేగంలో దానంతటది అదే పనిచేయ మొదలెడు

తుంది. అప్పుడు ఒక్క వూపులో దిశమార్చి గబ గబా టెన్జింగ్ నార్కే ఎవరెస్టు ఎక్కినట్లు ఈ సారి వందగజాలూ ఎక్కేస్తుందీ అని అతడు చెప్పాడు. ఇది బోలెడు నచ్చింది వెంకట్రావుకు. హాయ్ హాయ్ అనుకున్నాడు. ఆ ముగ్గురికి ధన్యవాదాలర్పించాడు. వాళ్లు వెళ్ళిపోతుంటే బలవంతంగా వారికో అయిదు రూపాయల నోటిచ్చాడు, తీరా ఇచ్చాక అయ్యో అవతల వాసవి చూస్తుండగా, తానొక లోభిలాగా ఆ ముగ్గురికీ కలిపి కేవలం అయిదు రూపాయలే ఇచ్చానే, ఇంకో అయిదు ఇవ్వాల్సిందేమో అనుకున్నాడు.

'క్షమించు వాసవీ' అని కారులో కూర్చున్నాడు. ఆమె పలక లేదు. నాలుగూ నలభై దాటింది.

కారుని వెనక్కి పోనిచ్చాడు. జంయ్‌మని క్రిందకు దిగిపోయింది కారు. ఇందాక అంత కష్టపడి ఎక్కిన ఎత్తంతా సునాయాసంగా దాటేసింది కారు. కాని అంత వేగంలోనూ కారు చప్పుడే చేయలేదు. అది మేల్కొననే లేదు. తీరా ఎత్తంతా అయి సమతలానికి వచ్చింది కారు; నిశ్శబ్దంగా బంకమట్టి ముద్దలా నిఃబ్బంశిపోయింది. ఎన్నో విధాల వెంకట్రావు ప్రయత్నించాడు కాని కారు కిక్కురు మనలేదు; తన హర్తాలు మానలేదు. కన్నీళ్లు మినహాగా ఏడిచేశాడు వెంకట్రావు—గింజుకున్నాడు. ఆ ఎక్కిన ఎనభై గజాల ఎత్తూవిడిచి వెన

కొట్టేచ్చాము గదా; ఆ వెధవలకు అయిను రూపాయలిచ్చి కొరివి తెచ్చుకున్నాముగదా అని ఆవేదన పడ్డాడు.

ఆవేదనలో అతడికి తన కారు ప్రక్కకొక స్కూటరు వచ్చి ఆగడం వినపడలేదు. కాని మరుక్షణం అటుచూస్తే "జగన్నాథపురం వెళ్తున్నా వాసవీ" అంటున్న పద్మనాభం కన్పించాడు.

ఏం జరుగుతున్నదీ అతడికి అర్థమయ్యేలోపుగా వాసవి కారు తలుపు తీసుకుని స్కూటర్ మీద పద్మనాభం వెన కాల కూచోవడం జరిగిపోయింది.

"వస్తాను మిష్టర్ వెంకట్రావ్......చాల థాంక్స్" అంది వాసవి. స్కూటరు హుషారుగా ఆ ఎత్తు రోడ్డును దాటేయసాగింది. వెంకట్రావ్ క్రింద నిలుచుని స్కూటర్ ఆ ఎత్తంతాగడచి సమతలమైన రోడ్డుచేరి కనుమరుగయ్యే దాక చూశాడు.

తన శక్తినంతా ఉపయోగించి కారునొక్క తన్ను తన్నాడు వెంకట్రావ్. అప్పటికీ అది కదల్లేదు.

X X X X

ఇది జరిగిన ఆరు నెలలకు పద్మనాభం వెంకట్రావ్ నుండి ఆ "48 మోడల్ హిందూస్తాన్ కారు"ని కొన్నాడు.

ఆ పాత కాగెందుకూ అని వాళ్లావిడ అడిగితే "ఆ రోజు ఈ కారట్లా మొండికి వెయ్యకపోతే నీవు నాదానివి అయ్యే దానివి కావుగా" అన్నాడు.

ప్రేమ తృప్తి, గర్వంలాటి వెన్నో అలలుగా పొంగినవి ఆమె కళ్ళల్లో.

('ఆనందవాణి!' 65)